క్లుప్తంగా

కారుణ్య నియామక పత్రాలు అందజేత

మణుగూరుటౌన్: సింగరేణిలో పనిచేస్తూ ఇన్వాలిడేట్ అయిన 10 మంది ఉద్యోగుల కుటుంబాలకు చెందిన అభ్యర్థులకు ఏరియా జీఎం దుర్గం రాంచందర్ మంగళవారం జీఎం కార్యాలయ ప్రాంగణంలో కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. క్రమశిక్షణతో పనిచేసు కోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో అధికారులు రమేష్, వెంకట్‌రావు, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ వై.రాంగోపాల్, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కృష్ణంరాజు, అధికారులు సింగు శ్రీనివాస్, రామేశ్వరరావు, చంద్రకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సహకరించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ కోరారు. మండలంలోని ఎర్రగుంట గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఫ్రెండ్లీ పోలీసింగ్, నూతన చట్టాల విధివిధానాలను ఆయన వివరించారు. బాధితులకే ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉంటుందని నేరస్తులకు కాదని ఆయన స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైన చట్టప్రకారమే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ సదస్సులో జూలూరుపాడు సీఐ ఇంద్రసేనరెడ్డి, ఎస్‌ఐ చంద్రశేఖర్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

మాస్‌లైన్ నాయకుల పర్యటన

చర్ల: మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ మండల కార్యదర్శి పాలెం చుక్కయ్య డిమాండ్ చేశారు. మండలంలో తాగునీటి ఎద్దడి ఉన్న ఆర్.కొత్తగూడెం, వెంకటచెరువు, చీమలపాడు, సుందరయ్యకాలనీ తదితర గ్రామాల్లో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ బృందం మంగళవారం పర్యటించింది. అనంతరం చర్లలో ఆయన మాట్లాడారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో అధికారులు తక్షణమే ముందస్తు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బెల్లంకొండ సమ్మయ్య, కల్లూరి రాజశేఖర్, ప్రసాద్, సుశీల, ముత్యాలక్క తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలి

ములకలపల్లి: గత డిసెంబర్‌లో విధుల నుంచి తొలగించిన గ్రీన్‌అంబాసిడర్లను సత్వరమే విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.యూసఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓ గద్దె రేవతికి వినతిపత్రం అందజేశారు. కొలూరి ముత్తమ్మ, కుంపటి కన్నమ్మ, కారుమంచి ముత్తమ్మ, కనకం భూషమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యాంశాల్లో చేర్చాలి

దమ్మపేట: స్వాతంత్ర్యం కోసం అలుపెరగని పోరాటాలు చేసి, ప్రాణాలర్పించిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వంటి మహనీయుల జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ అనుబంధ ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) జిల్లా కార్యదర్శి కొర్సా రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రం దమ్మపేటలో మండల స్థాయి పీవైఎల్ యువజన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. కాకా వెంకటేష్, కుంజా అర్జున్, సున్నం జగన్, మహేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

సీతారామ నీరు ఇవ్వాలి

బూర్గంపాడు: సీతారామ ప్రాజెక్ట్ నుంచి ఇతర ప్రాంతాలకు గోదావరి జలాలను తరలిస్తున్న పాలకులు.. బూర్గంపాడు మండలంలోని రైతులకు అన్యాయం చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు ఆరోపించారు. సారపాకలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బూర్గంపాడు మండల రైతాంగానికి శాశ్వతంగా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎంబి.నర్సారెడ్డి, బత్తుల వెంకటేశ్వర్లు, పాండవుల రామనాథం, బయ్యా రాము, రాయల వెంకటేశ్వర్లు, కనకం వెంకటేశ్వర్లు, ఎస్‌కె.అబీదా, గుంటక కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్ పార్టీ

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల జిల్లా ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు మంగళవారం ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. అనంతరం అతిథిగా పాల్గొన్న ఎంఈఓ, పాఠశాల హెచ్‌యం సున్నం సమ్మయ్య మాట్లాడుతూ.. పది విద్యార్థులు భయం లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. ఇన్‌చార్జ్ హెచ్‌యం ఏజే ప్రభాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఈ యేడు పూర్తయ్యేనా?



పంప్‌హౌస్ సమీపంలో కొనసాగుతున్న మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు

నత్తనడకన మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు

- ఈ పంట కాలం వరకు పూర్తి అవుతాయని నాడు మంత్రి ప్రకటన
- నేటికీ ఎర్త్ పనుల వద్దే ప్రాజెక్టు..

అశ్వాపురం: మండల పరిధిలోని బీజీకొత్తూరు గ్రామంలో సీతారామ ప్రాజెక్ట్ ఫేజ్–1 పంప్‌హౌస్ సమీపంలో ప్రధాన కాలువకు అనుబంధంగా నిర్మిస్తున్న మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ పనులు ఎప్పుడు పూర్తి అవుతాయా అని వేలమంది రైతులు ఎదురు చూస్తున్నారు.

మండలంలో సీతారామ ప్రాజెక్ట్ ద్వారా తుమ్మలచెరువుతో పాటు పలు చెరువుల ద్వారా సుమారు 17 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు పంప్‌హౌస్ సమీపంలో మారెళ్లపాడు ఎత్తిపోతల పథకానికి ప్రణాళిక రూపొందించారు. ఆ మేరకు ప్రధాన కెనాల్‌కు అనుబంధంగా రూ.25 కోట్లతో ఈ పథకాన్ని గత ప్రభుత్వంలో 29 జనవరి 2023న శంకుస్థాపన చేశారు. ఇది జరిగి రెండేళ్లు అయినా ఎత్తిపోతల పథకం పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. ఇప్పటికి కేవలం ఎర్త్ వర్క్ పనులు మాత్రమే జరుగుతున్నాయి. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా ఎన్ఎస్‌పీ కెనాల్‌కు నీరు తరలిస్తూ ఈ ప్రాంత రైతులకు ఒక్క ఎకరాకు నీరు ఇవ్వడం లేదని మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు వేగవంతం చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పనిచేయని మంత్రి చొరవ

మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పూర్తి చేయడంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలుమార్లు ప్రకటనలు ఇచ్చినప్పటికీ అవి అమలుకు నోచుకోలేదు. 2024 జూన్‌లో బీజీ కొత్తూరులో సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్ ట్రయల్ రన్ సందర్భంగా స్థానిక రైతులు ఈ ప్రాజెక్టు విషయమై మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పథకం పనులు త్వరితగతిన పూర్తి చేసి 5 నెలల్లో ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందిస్తామని భరోసానిచ్చారు. ఈ మేరకు ఆయన జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు.

ఈ సంఘటన జరిగి ఎనిమిది నెలలు పూర్తి అయినా పనుల్లో ఎలాంటి పురోగతీ లేదు. ఇక, ఇటీవల నాగార్జున్ సాగర్ కెనాల్‌కు సీతారామ ప్రాజెక్ట్ ద్వారా నీరు తరలించేందుకు బీజీ కొత్తూరు పంప్‌హౌస్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించగా.. ఎన్ఎస్‌పీ కెనాల్‌కు నీరు తరలిస్తూ తమకు నీరు ఇవ్వడం లేదని, మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు జరగడం లేదని స్థానిక రైతులు మంత్రి తుమ్మలకు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఈ పంట కాలం వరకు మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేసి పినపాక నియోజకవర్గ రైతాంగానికి సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. ఈ సారైనా మంత్రి ప్రకటన అమలు అవుతుందా.. ఈ పంట కాలానికి నీరు అందిస్తారా లేదా అని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వేసవికాలంలో ఈ మూడు నెలలైనా మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు వేగవంతం చేసి ఖరీఫ్ సీజన్ వరకు పూర్తి చేసి సీతారామ ప్రాజెక్ట్ ద్వారా ఆయకట్టుకు నీరు అందించాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

ఆయకట్టుకు నీరు అందించాలి



సీతారామ ప్రాజెక్ట్ ద్వారా ఇతర ప్రాంతాలకు ఎన్ఎస్‌పీ కెనాల్‌కు నీరు తరలిస్తూ ఈ ప్రాంత రైతులకు నీరు ఇవ్వకపోవడం బాధాకరం. స్థానిక రైతాంగం భూములు ఇస్తేనే పంప్‌హౌస్, కెనాల్ నిర్మాణం సాధ్యమైంది. తుమ్మలచెరువు ఆయకట్టు పరిధిలోని స్థానిక రైతాంగానికి సీతారామ ప్రాజెక్ట్ ద్వారా వెంటనే సాగునీరు అందించాలి.

– మద్రి మల్లారెడ్డి, మాజీ సర్పంచ్, మొండికుంట

పనులు వేగవంతం చేయాలి



తుమ్మలచెరువుకు సీతారామ ప్రాజెక్ట్ నీరు అందిస్తే ఈ ప్రాంత రైతులకు రెండు పంటలు పండుతాయి. రెండేళ్ల క్రితం మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు చేపట్టారు. ఇప్పటి వరకు పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలి.

– ఆవుల రవి, ఆయకట్టు రైతు, మల్లెలమడుగు

లోవోల్టేజీ పరిష్కారానికి చర్యలు



కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న డీఈ, ఏడీ తదితరులు

బూర్గంపాడు: విద్యుత్ సరఫరాలో లోవోల్టేజీ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ జీవన్‌కుమార్ అన్నారు. మోరంపల్లిబంజరలో నూతనంగా ఏర్పాటు చేసిన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను, రెండు 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు, అంజనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన రెండు 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను మంగళవారం ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా లోవోల్టేజీ సమస్యను అధిగమించేందుకు అవసరమున్నచోట్ల కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏడీ వేణు, ఏఈ సారిక, లైన్ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలపై నిర్ణయం తీసుకోవాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ రాంగోపాల్

మణుగూరుటౌన్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నారని, హైపవర్ వేతనాలు చెల్లించేలా బడ్జెట్ సమావేశాల్లో నిర్ణయం తీసుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ మణుగూరు బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం పీవీకాలనీలో కేఎల్ మహేంద్రభవన్ ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎండల తీవ్రత దృష్టిలో పెట్టుకుని తగిన చర్యలు తీసుకోవాలని మజ్జిగ ఓఆర్ఎస్ ప్యాకెట్ అందించాలని సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. అనంతరం యూనియన్ మణుగూరు ఏరియా కార్యదర్శి ఆదర్ల సురేందర్ మాట్లాడారు. ఆఫీస్ బేరర్ శనిగరపు కుమారస్వామి, స్టోర్స్ సివిల్ పిట్ సెక్రటరీలు శరత్, శివ, రాజేందర్, సమ్మయ్య, వీరబాబు, దుర్గారావు, శ్రీను, రామకృష్ణ, ఆదాము, సీతారాములు, ఉపేంద్ర, ఈశ్వరి, అలివేలు, బాషా, శ్రీవాణి, ఇమామి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దందాకు అడ్డుకట్ట వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల కన్వీనర్ నాగేశ్వరరావు

మణుగూరురూరల్: అక్రమ రేషన్ బియ్యం దందాకు అధికారులు అడ్డుకట్ట వేయాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మణుగూరు ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు ముఠాగా ఏర్పడి రేషన్ బియ్యాన్ని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. పేద ప్రజలకు అందాల్సిన బియ్యం పక్కదారి పడుతుంటే.. అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ కుంటా లక్ష్మణ్, కోకన్వీనర్లు బొలిశెట్టి నవీన్, నూకారపు రమేష్, నాయకులు వట్టం రాంబాబు, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, ముద్దంగుల కృష్ణ, అక్కి నర్సింహరావు, ఆవుల నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై విరిగిపడిన వృక్షం

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని నందిపాడు సమీపంలో భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారిపై పూర్తిగా ఎండిపోయిన వృక్షం విరిగి పడిపోయింది. మధ్యాహ్న సమయంలో రోడ్డుకు అడ్డంగా పడిన వృక్షంతో ఇటు వైపుగా రాకపోకలు సాగించిన వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈ సమాచారాన్ని అందుకున్న స్థానిక రోడ్లు భవనాల శాఖ అధికారులు తమ సిబ్బందిని పంపించి రోడ్డుపై పడిన వృక్షాన్ని తీయించారు. దీంతో వాహనదారులకు అవస్థలు తప్పాయి.



అశ్వారావుపేట-భద్రాచలం మార్గంలో రోడ్డుపై పడిపోయిన ఎండిన వృక్షం

అధిక ధరల వసూలుపై జరిమానా

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో ఉన్న దుకాణాల్లో వస్తువులు కొనుగోలుపై ఎమ్మార్పీ కంటే అధికంగా వసూలు చేస్తున్నట్లుగా ఓ ప్రయాణికుడు అధికారులకు సోమవారం ఫిర్యాదు చేయగా.. సదరు స్టాల్ నిర్వాహకులకు ఆర్టీసీ అధికారులు రూ.500 లు ఫైన్ వేశారు. కాగా ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న స్టాల్స్‌ను దక్కించుకోవడానికి తక్కువ రేట్‌కు కోట్ వేసి ఇలా ప్రయాణికులను దోచుకుంటున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి

గుండాల: ఆళ్లపల్లి మండల కేంద్రంలో రోడ్డును ఆక్రమించిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు పూనెం వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆళ్లపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. అధికారులు గ్రామసభ నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పూనెం రాంబాబు, మెస్సు గోపాల క్రిష్ణ, మల్లేష్, హరీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

‘మభ్యపెడుతున్న ప్రభుత్వం’

మణుగూరురూరల్: ఇచ్చిన హామీలను అమలుచేయలేని రాష్ట్రప్రభుత్వం మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతోందని బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోనే కాక పినపాక నియోజవర్గ ప్రజలకు ఇచ్చిన ఏ హామీ కూడా సంపూర్ణంగా అమలుకాలేదని, మహలక్ష్మి, ఆత్మీయ భరోసా, రైతుభరోసా పథకాలు 20 శాతమే అమలవుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ఇకనైనా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా నగదుతో పాటు తులం బంగారం, మహిళలకు నెలనెలా రూ.2,500, విద్యార్థినులకు స్కూటీ ఇవ్వడమే కాక పింఛన్లు పెంచాలని డిమాండ్ చేశారు.

జీఓ 64ను రద్దు చేయాలి

గుండాల: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని వివిధ వసతి గృహాల్లో పని చేస్తున్న డైలివేజ్ వర్కర్ల వేతనాలు తగ్గించే జీఓ నం.64ను వెంటనే ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జోగ రాంబాబు డిమాండ్ చేశారు. ఉమ్మడి గుండాల మండలంలో పనిచేస్తున్న డైలివేజ్ వర్కర్లు చేపట్టిన సమ్మెకు ఆయన మద్దతు ప్రకటించారు. శంభునిగూడెం ఆశ్రమ పాఠశాల ఆవరణలో సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు.

పోరాటానికి సిద్ధమవ్వాలి

మణుగూరురూరల్: నిరుపేదలకు ఉచితంగా ఇసుక ఇచ్చేంత వరకు ప్రజా పక్షాన పోరాటం చేసేందుకు సిద్ధం కావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు కార్యకర్తలకు మంగళవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. పినపాక నియోజకవర్గంలోని మణుగూరు, పినపాక, కరకగూడెం, అశ్వాపురం, బూర్గంపాడు, ఆళ్లపల్లి, గుండాల మండలాలతో పాటు పాల్వంచ, భద్రాచలం ప్రాంతాల్లో అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా జరుగుతున్నా.. చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే ఈ దందా నడుస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా అక్రమ ఇసుక రవాణా జరిగితే ఫొటోలు, వీడియోలు తీసి తనకు పంపాలని పిలుపునిచ్చారు.

తాలిపేరు కాలువ పరిశీలన



కాలువను పరిశీలిస్తున్న ఈఈ, అధికారులు

దుమ్ముగూడెం: మండలంలోని తాలిపేరు కాలువను ఇరిగేషన్ ఈఈ హెచ్‌వీ రాంప్రసాద్ మంగళవారం పరిశీలించారు. వేసవి పంటకు మండలంలో నీటి విడుదల నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఈ మేరకు ఆర్‌డీ 21,18,19 కాలువలను పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు అందజేశారు. ఆయన వెంట డీఈ మధుసూధన్‌రావు, ఏఈ హర్ష, జేఈ రాజ్ సుహాస్, పీటీ మస్తాన్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ముసలమ్మ జాతర

గుండాల: ఈనేటి నుంచి ముసలమ్మ జాతరసం వంశీయుల ఇలవేల్పు దూలుగొండ ముసలమ్మ (దేవత) జాతర బుధవారం నుంచి రోళ్లగడ్డలో ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం వరకు జరగనున్న ఈ జాతరలో భాగంగా బుధవారం వనం నుంచి దేవతను గుడికి చేర్చుట, గురువారం గంగాస్నానం, గుడిమెలుగుట శుక్రవారం మొక్కులు చెల్లించు కార్యక్రమాలు జరుగుతాయని ఈసం వంశీయులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోలమాంబదేవి జాతర..

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని అచ్యుతాపురం గ్రామ శివారులోని పోలమాంబదేవి ఆలయం వద్ద నేటి(బుధవారం) నుంచి జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అఖండ దీపారాధన, రాత్రికి భక్తులచే భజన కార్యక్రమాలను నిర్వహిస్తారు. 22వ తేదీ వరకు పలు రకాల కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ఐఎన్‌టీయూసీతో స్ట్రక్చర్ సమావేశం



ఐఎన్‌టీయూసీ నాయకులతో స్ట్రక్చర్ సమావేశం నిర్వహిస్తున్న జీఎం

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం కార్యాలయంలో ఐఎన్‌టీయూసీ నాయకులతో స్ట్రక్చర్ సమావేశం నిర్వహించగా.. వివిధ సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం దుర్గం రాంచందర్ మాట్లాడుతూ.. కార్మిక సంఘాలు–యాజమాన్యం మధ్య సహృద్భావం, సమన్వయం ఉంటే పారిశ్రామిక ప్రశాంతత ఏర్పడి నిరాటంకంగా ఉత్పత్తి జరుగుతుందన్నారు. ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కృష్ణంరాజు మాట్లాడుతూ.. ప్రాతినిధ్య సంఘం సంస్థ అభివృద్ధికి, మనుగడకు చూస్తుందని, ఇండస్ట్రియల్ ఓరియంటెడ్ యూనియన్‌గా గుర్తించాలని కోరారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన జీఎం పరిష్కారానికి ఆయా విభాగాల అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. సమావేశంలో అన్ని విభాగాల అధికారులు, ఐఎన్‌టీయూసీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన న్యాయమూర్తి



సిబ్బందికి సూచనలిస్తున్న జడ్జి శివనాయక్

భద్రాచలంటౌన్: స్థానిక చర్ల రోడ్‌లోని గిరిజన సంక్షేమ పాఠశాల, కళాశాలను భద్రాచలం ఫస్ట్‌క్లాస్ జడ్జి వి.శివనాయక్ మంగళవారం సందర్శించారు. క్లాస్ రూమ్‌లను పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సలహాలు, సూచనలు తెలియజేశారు. తరగతి, వసతి గదులను నిత్యం శుభ్రం చేస్తూ, చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో లీగల్ సెల్ సిబ్బంది, పాఠశాల, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

గుండాల: ఆత్మరక్షణ కోసం కరాటే శిక్షణ తీసుకోవడం చాలా అవసరమని, ఈ శిక్షణలో జాతీయ స్థాయిలో రాణించాలని సీఐ రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే పోటీలో విజయం సాధించడంతో మంగళవారం అభినందించారు. ఏడుగురు విద్యార్థులు బంగారు పతకాలు, ఇద్దరు సిల్వర్ పతకాలు సాధించారు. దీంతో వాసవీక్లబ్ గ్రీన్ ఫీల్డ్ మండల అధ్యక్షులు మానాల శ్రావన్, కరాటే ట్రైనర్ మంకిడి సుధాకర్‌లు విద్యార్థులను శాలువాతో సత్కరించి, ప్రశంసాపత్రాలను అందించారు. కార్యదర్శి మానాల ఉపేందర్, కోశాధికారి గొరిశెట్టి శరత్, టి.నాగరాజు, టి.రాంబాబు, పూజిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు తాగునీటి ఫ్రిజ్ వితరణ



ఫ్రిజ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ములకలపల్లి: మండల పరిధిలోని తిమ్మంపేట ప్రాథమికోన్నత పాఠశాలకు స్థానిక జలగం లీలా సంతోష్‌కుమార్ వాటర్ ప్యూరిఫైయర్, ఫ్రిజ్‌ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం స్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు వీటిని ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శంకర్, ఉపాధ్యాయ బృందం నిర్మల, సురేశ్, ప్రశాంత్, ముక్తేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నరసింహ స్వామి జాతర



ఆలయంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా, తదితరులు

దమ్మపేట: మండలంలోని గొర్రెగుట్ట గ్రామంలో ఉన్న లక్ష్మీనరసింహ స్వామి జాతర మహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. జాతరను పురస్కరించుకుని మంగళవారం ఆలయంలో అభిషేకాలు, పూజలు నిర్వహించగా.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, నాయకులు ఆలయ సందర్శన చేసి, స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

రిజర్వేషన్ల నిర్ణయంపై హర్షం

అసెంబ్లీ సమావేశాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం, ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు ఆమోదం తెలపడంపై ఆయా కుల సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. సంఘ కార్యాలయాల్లో నాయకులు మిఠాయిలు తినిపించుకుంటూ సంబురాలు చేసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తమ ప్రభుత్వం ఇచ్చినమాట నిలబెట్టుకుందని స్పష్టం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



మణుగూరుటౌన్: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



మణుగూరురూరల్: మిఠాయిలు తినిపించుకుంటున్న మున్నూరుకాపు సంఘ నాయకులు



అశ్వాపురం: రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం..